క్లుప్తంగా

నేలవాలిన వరి



నేలవాలిన వరిని చూపుతున్న రాజేశ్వర్‌రావు

ముత్తారం: మండలంలో ఇటీవలన వీచిన గాలివాన దుమారానికి వరి నేలవాలింది. చేతికొచ్చిన పంట గాలికి నేలమట్టం అవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేలవాలిన పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి తగు సూచనలు చేయాలని, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిధుల మంజూరుపై సంబరాలు



స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పలు గ్రామాలకు రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పందిల్లలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నిధుల మంజూరుకు కృషిచేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మానేరు నదిపై ఓదెల మండలం శానగొండ, జమ్మికుంట మండలం విలాసాగర్ వంతెన నిర్మాణం, కాల్వశ్రీరాంపూర్ మండలం పోచంపల్లి నుంచి ఓదెల మల్లికార్జునస్వామి ఆలయం వరకు, కాల్వశ్రీరాంపూర్ నుంచి వయా పందిల్ల మీదుగా పొత్కపల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ సర్కార్ నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, మాజీ సర్పంచు అటికం శంకర్, నాయకులు రామిడి తిరుపతిరెడ్డి, మునీర్, జిన్న రాంచంద్రారెడ్డి, బాల సమ్మయ్య, రాజుపటేల్, రసూల్, ప్రభాకర్, చిలుముల రాజు, ఇల్లందుల రమేశ్, ఉదయ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు



అన్నయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి సునీల్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బి.సురేశ్ గౌడ్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్యగౌడ్‌ను గురువారం వారు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డుపల్లి జగదీశ్, గంగుల సంతోష్, పడాల సతీశ్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఉచితంగా సన్‌ఫ్లవర్ గింజలు



సన్‌ఫ్లవర్ గింజలు అందజేస్తున్న ఏవో

పాలకుర్తి: మండలంలో పొద్దుతిరుగుడు పంట సాగుచేసే రైతులకు కేంద్ర నూనె గింజల మిషన్ పథకంలో భాగంగా ఉచితంగా గింజలు అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. గురువారం పలువురు రైతులకు పొద్దుతిరుగుడు గింజలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిల్వాన్ టెక్ సన్-1 హైబ్రీడ్ రకం అధిక దిగుబడి, అధిక నూనె కలిగి ఉంటుందని, ఇది వానాకాలం, యాసంగి రెండుకాలాలకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. రైతులు పూర్తి వివరాలకు వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇంటిపన్ను వసూలు చేయండి

ఓదెల: ఇంటిపన్ను బకాయిలు వసూలు చేయాలని డిప్యూటీ సీఈవో, ఓదెల మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం ఓదెల మండలపరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్, ఏఈఈ జగదీశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సాక్షి స్పందన



పిచ్చిమొక్కల తొలగింపు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట నుంచి వదుకాపూర్ వెళ్లే దారిలో సాముల్యు దాటిన తర్వాత బీసీ శ్మశానవాటిక క్రాసింగ్ వరకు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు చర్యలు చేపట్టాలని 23న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. కార్యదర్శి పున్నమయ్య ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో రోడ్డుకి ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

హాస్టల్ దారిలో వీధిలైట్లు ఏర్పాటు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌కు వెళ్లే దారిలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ గురువారం వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. 23న సాక్షి దినపత్రికలో హాస్టల్‌కు వెళ్లే దారిలో చీమ్మ చీకట్లు అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వీధిలైట్లు ఏర్పాటు చేయించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.





గుంతలు పూడ్చివేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వలలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో రోడ్డు అధ్వానంగా మారింది. వర్షం కురిసినపుడు గుంతలు పడి నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు గుంతల్లో మట్టి, డస్ట్ పోయించి పూడ్చి వేయించారు.

రుణమాఫీ చేస్తారా.. లేదా?

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పాలకులు రుణమాఫీ చేయలేక సాకులు చూపి చేతులెత్తేశారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. గురువారం పెద్దపల్లిలో మాట్లాడారు. రుణమాఫీ, తదితర హామీల నుంచి దృష్టి మళ్లించేందుకే హైడ్రా అంశాన్ని తెరపైకి తెచ్చారని ధ్వజమెత్తారు. రుణమాఫీ చేస్తారా..లేదా అనే విషయమై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పాలకులు కొత్త రేషన్ కార్డులు ఇయ్యలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా కొత్త కార్డులు జారీ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఎన్నికల్లో తాను బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో పల్లె సదానందం, ఠాకూర్‌రాంసింగ్, రమేశ్, శివంగారి సతీశ్, జంగ చక్రధర్‌రెడ్డి, క్రాంతి, శ్రీనివాసరావు, నరేశ్, ఫహీం, దిలీప్‌కుమార్, రాజవీరు, కరుణాకర్, రవి, కుమార్, విజయ్, సంతోష్, సతీశ్‌సింగ్, ప్రకాశ్, కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన

పెద్దపల్లిరూరల్: ఆయుధాల వినియోగంపై పాఠశాల విద్యార్థులకు గురువారం పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో అధికారులు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులకు ఆయుధాలు, వాటి వినియోగంపై వివరించారు. సైబర్‌క్రైం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, సుబ్బారెడ్డి, ఎస్సై లక్ష్మణ్‌రావు ఉన్నారు.

కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్

కమాన్‌పూర్: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుధాలు, వాటి వినియోగం, ఆన్‌లైన్‌లో చేసే పిటిషన్ దరఖాస్తుల వివరాలపై విద్యార్థులకు ఎస్సై ప్రసాద్ అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దపల్లిరూరల్: అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంథనిలో..

మంథని: మంథనిలోని పోలీస్‌స్టేషన్ గురువారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాలు, వాటి పని విధానంపై అవగాహన కల్పించారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్, మంథని సీఐ రాజు, ఎస్ఐ రమేశ్ ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బీఆర్ఎస్ కృషి ఫలితమే

రామగుండం: రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుతో పాటు కుందనపల్లి, లింగాపూర్ పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీన ప్రతిపాదనలు రద్దు చేయడం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని బీఆర్ఎస్ ప్రతినిధులు అన్నారు. గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ చిత్రపటాలకు స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలో పార్టీ ప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పాటుపడిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే చందర్ మాత్రమేనన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, ఉప్పరి లక్ష్మణ్, శివరాత్రి గంగాధర్, బదావత్ సారయ్య నాయక్, అసాది వేణుగోపాల్, కలవేని మల్లేశ్, షేక్ ఇంతియాజ్, జశ్వంత్, సిరిపురం అశోక్, ఆవునూరి ప్రశాంత్, కొంకటి ప్రసాద్, పల్లపు రాజు, గండ్ల సతీశ్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులదే కీలకపాత్ర

సుల్తానాబాద్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులదే కీలక పాత్ర అని పోలీసు కళాజాత బృందం సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. మండల కేంద్రంలోని కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా వద్ద గురువారం ప్రదర్శన నిర్వహించారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నివాళి అర్పించారు. ఎస్సై శ్రవణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్, సిబ్బంది ఉన్నారు.

పెద్దంపేట గ్రామాన్ని అభివృద్ధి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామాభివృద్ధిపై గురువారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను గ్రామ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా పెద్దంపేట ప్రధాన రైల్వేగేట్ నుంచి భగత్‌సింగ్ విగ్రహం దారి మీదుగా రాయదండి వంతెన వరకు సీసీరోడ్డు నిర్మాణం, పోచమ్మ ఆలయం నుంచి కొలిపాక మహేందర్‌రెడ్డి ఇంటి వరకు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. రైల్వేగేట్ నుంచి రైల్వేస్టేషన్ రహదారి వరకు విద్యుత్ దీపాల బిగింపు, కోడిపుంజుల కల్యాణ్ ఇంటి నుంచి వేల్పుల సత్తయ్య ఇంటి వరకు, మేర్గు మొండయ్య ఇంటి నుంచి అయిడపు రాజేశం ఇంటి వరకు, కోడిపుంజుల చంద్రయ్య ఇంటి నుంచి పెండ్యాల విజయ్ ఇంటి వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైట్స్ బిగించాలని కోరారు. రైల్వేగేట్ నుంచి జీడి వాగు వరకు సీసీరోడ్డు నిర్మించాలని, కొమురంభీం కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

క్యాంటీన్‌లో సౌకర్యాలు మెరుగుపర్చాలి



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కంపెనీ ఉన్నతాధికారి అభయ్, కార్మికసంఘం నాయకులు కౌశికహరి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికులకు సంబంధించిన క్యాంటీన్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు కౌశికహరి కోరారు. కంపెనీ ఉన్నతాధికారి అభయ్‌తో పాటు కార్మికులతో కలిసి గురువారం క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్ ద్వారా కార్మికులకు అందించే ఆహారపదార్థాలు నాణ్యతగా ఉండేలా చర్యలు చేపట్టాలని, అవసరమైతే నిర్వాహకులకు కంపెనీ ద్వారా చెల్లించే మొత్తాన్ని ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని సూచించారు. కాగా అభయ్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. దీపావళి బోనస్ గతేడాది కంటే అదనంగా, కర్ణాటకలోని వాసవిదత్తా సిమెంట్ కర్మాగారం కార్మికులతో సమానంగా చెల్లించాలని కౌశికహరి కోరారు. త్రిపాఠి హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథి, కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

సింగరేణి వార్తలు

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు

రామగిరి: చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. సింగరేణిలో కారుణ్య నియామక ఉత్తర్వులు పొందిన 31మంది అభ్యర్థులకు, సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో డిస్మిస్ అయి తిరిగి బదిలీ వర్కర్లుగా నియమితులైన 11 మందికి స్థానిక ఎంవీటీసీలో శిక్షణ నిర్వహిస్తున్నారు. కాగా గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టమని, సంస్థ ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఇచ్చిన గడువులోగా విధుల్లో చేరాలన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, డీవైపీఎం గుర్రం శ్రీహరి, డీఎస్ఈ శ్రీనివాస్, డీఎస్ఈ శ్రీనివాస్, బోధకుడు వీరన్న పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో యువ ఉద్యోగుల పాత్ర కీలకం

గోదావరిఖని: సంస్థ అభివృద్ధిలో యువ ఉద్యోగుల పాత్ర కీలకమని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన 18మంది కార్మికుల పిల్లలకు గురువారం కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. వీరిలో 11మంది పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారని తెలిపారు. జీఎం మాట్లాడుతూ సంస్థ సీఅండ్ఎండీ బలరాం ఆదేశాల మేరకు త్వరితగతిన కారుణ్య నియామక ఉత్తర్వులు అందిస్తున్నామన్నారు. యువ ఉద్యోగులు ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా పని నైపుణ్యాన్ని మెరుగుపరచుకొని కంపెనీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. విధులకు గైర్హాజరు కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీఎంవోఏఐ ప్రతినిధి క్రాంతి, నాయకులు రంగు శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవోలు శ్రావణ్‌కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.



ఉద్యోగులతో జీఎం లలిత్‌కుమార్

బొగ్గు పట్టివేత

ఫెర్టిలైజర్‌సిటీ: బొగ్గును దొంగిలించి తరలించేందుకు సిద్ధమవగా అధికారులు పట్టుకున్నారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్‌లో ఎన్టీపీసీ గూడ్స్ రైలు నుంచి బొగ్గును దొంగిలించి తరలించేందుకు సిద్ధమవగా గురువారం సింగరేణి ఆర్జీ–1 సెక్యూరిటీ అండ్ పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్, అక్బర్ అలీ స్వాధీనం చేసుకుని జీఎం కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న బొగ్గు విలువ రూ.5,000 ఉంటుందని అధికారులు తెలిపారు. దాడిలో శ్రీనివాస్, రాధాకృష్ణ, రాజు పాల్గొన్నారు.



బొగ్గును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయం

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలోని ఏపీఏ గనిలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమని ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మికసంఘం ఆర్జీ–3 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఉడుత శంకర్ అన్నారు. సెంటినరీకాలనీ శ్రీపాదభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నిరోజులుగా పనిచేస్తున్న కార్మికులను కంపెనీ వద్దు అనడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకుని వారికి ఉద్యోగం కల్పించాలని కోరారు. బ్రాంచ్ సెక్రటరీ మల్లారి మల్లారెడ్డి, ఏపీఏ పిట్ సెక్రటరీ పాంచాల కృష్ణమూర్తి, కుమార్ పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌బారీ, ప్రధాన కార్యదర్శిగా సోమిశెట్టి తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా పదవులకు పోటీ ఏర్పడడంతో పోలింగ్ నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా అజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా జహంగీర్, కోశాధికారిగా అఫ్జల్ ఎన్నికయ్యారు.



షేక్ అబ్దుల్‌బారి



తిరుపతి

శేఖర్‌రావుకు ట్రస్మా మద్దతు

పెద్దపల్లిరూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహులు యాదగిరి శేఖర్‌రావుకు ట్రస్మా సభ్యులు మద్దతు ప్రకటించారు. పెద్దపల్లిలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని వారు కోరారు. సమావేశంలో ట్రస్మా సలహాదారులు ఆర్‌వీ రమణారావు, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లెంకి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీధర్, సంజీవరెడ్డి, ఓదెలు, మోహన్‌రాజ్, శైలజ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఉద్యోగ భద్రత కల్పించాలి

పెద్దపల్లిరూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనజారాణి, జ్యోతి కోరారు. గురువారం జిల్లా సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రైచ్ సెంటర్లు ప్రారంభించొద్దని కోరారు. క్రైచ్ సెంటర్ల విధి విధానాలను చెప్పకుండానే ములుగు జిల్లాలో ఏర్పాటు చేయడం సరికాదన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

• సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జూలపల్లి: గ్రామీణ ప్రజలు మత్తు పదార్థాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని పోలీసు కళాబృందం కళాకారులు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని బస్టాండు కూడలి వద్ద గురువారం సైబర్‌క్రైం, మత్తు పదార్థాలు మూఢనమ్మకాలు, కులవివక్షపై కళా బృందంతో అవగాహన కల్పించారు. హెచ్‌సీ శ్రావణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

• ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై ఏఎస్సై మల్లన్న ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. షీటీం సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా 63039 23700 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు. షీటీం సభ్యులు ఆశ్రిత, సురేశ్, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు.

• ఎన్టీపీసీ పీటీఎస్‌లో సుందరకాండ పారాయణం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ఆలయంలో సుందరకాండ పారాయణం నిర్వహిస్తున్నారు. ఏడో రోజు పారాయణంలో భాగంగా గురువారం అగ్ని ప్రతిష్ఠ, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ వైకుంఠపురం అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రీమాన్ తూపురాణి శ్రీరమణి రంగాచార్యుల పర్యవేక్షణలో సుందరకాండ పారాయణం, శ్రీమద్రామాయణ ప్రవచనాలు చేశారు.

• సుల్తానాబాద్‌కు పేరు తీసుకురావాలి

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారుచేసి సుల్తానాబాద్‌కు పేరు తీసుకురావాలని వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ రవీందర్ కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో పీఈటీగా ఉద్యోగం సాధించిన కల్వల వెంకటేశ్‌ను మున్సిపల్ పరిధిలోని పూసాల వివేకానంద హైస్కూల్‌లో రవీందర్ సన్మానించారు.

• మీసేవ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నిక

పెద్దపల్లిరూరల్/ఓదెల: మీసేవ ఫెడరేషన్ ఎన్నికలు గురువారం హైదరాబాద్‌లో జరిగాయి. ఇందులో పెద్దపల్లికి చెందిన నగునూరి శ్రీనివాస్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, మండలంలోని పొత్కపల్లికి చెందిన మీసేవ నిర్వాహకులు రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు.

• టీచర్లు సమయపాలన పాటించాలి

ముత్తారం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో సురేశ్ సూచించారు. మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీలోని జిల్లాలపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను గురువారం ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు.

• పశువులకు గాలికుంటు నివారణ టీకా

ఎలిగేడు: మండలంలోని నారాయణపల్లిలో గురువారం పశువులకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకా వేశారు. వెటర్నరీ వైద్యులు ఝాన్సీ, గోపాలమిత్ర సమ్మయ్య పాల్గొన్నారు.

• బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించండి

మంథని: మున్సిపల్ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ గురువారం చైర్‌పర్సన్ పెండ్రు రమ, కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందించారు. బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి శ్రీధర్‌బాబు రూ.5లక్షలు కేటాయించాలని, 60శాతానికి పైగా ఉన్న బీసీలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గోదావరి నదికి వెళ్లే సబ్‌స్టేషన్ వద్ద ఉన్న భూమిలో కొంత భూమి కేటాయించేలా కృషి చేయాలన్నారు.

• అనారోగ్యంతో వ్యక్తి మృతి

ముత్తారం: మండలం ఓడేడులో రత్న సంపత్(45) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. సంపత్ తల్లిదండ్రులు లచ్చమ్మ, ఓదెలు రెండేళ్లలో అనారోగ్యంతో వరుసగా చనిపోయారు. తల్లిదండ్రులు చనిపోయిన అప్పటి నుంచి సంపత్ మనోవేదనకు గురై అనారోగ్యంపాలయ్యాడు. ఆరునెలల నుంచి వైద్యం చేయించుకుంటున్నా ఫలితం దక్కలేదు. తల్లిదండ్రుల మరణం తట్టుకోలేక ఆరోగ్యం క్షీణించి చనిపోయాడని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు ఉన్నారు.

• ఎంఈవోకు సన్మానం

జూలపల్లి: ఎంఈవోగా పనిచేసి బదిలీపై వెళ్తున్న కవితను మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో హెచ్ఎంలు సన్మానించారు.

భగవద్గీత పంపిణీ

సుల్తానాబాద్: విద్యార్థి దశలోనే భగవద్గీత చదవాలని తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ జిల్లా కన్వీనర్ మోంగని చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవాణి కళాశాలలో గురువారం విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ కమలాకర్ ఉన్నారు.